రాకపోవటంతో.."

"నువ్వన్నది నిజమే. నెల నుంచి చూస్తున్నాం ప్రతి రోజూ" చెప్పాడు నా భావాలు అర్థమయినట్టు.

అక్కడితో ఆగితే బావుండేది. "ఈరోజెవరో ఆ వగలాడి వలలో పడుంటారు. రోజా మాటలతో కవ్విస్తుంది కదా!" అంటూండగానే...అతని చెంప పగిలింది.

ఇద్దరం షాక్‌కు గురయ్యాం..ఈ ఆకస్మిక పరిణామానికి ఎదురుగా కండక్టర్. కోపంతో అతని ముక్కుపుటాలు ఎగిసిపడుతున్నాయ్!

"మీకేం తెలుసని- నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారు. ఆమె ఎవరో..ఏం చేస్తుంటుందో మీకు తెలుసా?" నోరుజారి ఇబ్బందికర పరిస్థితుల్లో ఉన్నాం. మాట్లాడలేకపోయాం. అతనే చెప్పటం కొనసాగించాడు.

"మృత్యుముఖంలో ఉన్న ఎందరికో చివరి కోరికను తీరుస్తున్న దేవత ఆమె.."

"అంటే అర్థం కాలేదు కదూ! కేన్సర్‌లాంటి ప్రాణాంతక వ్యాధులు సోకి రేపోమాపో చనిపోతున్నారన్న వాళ్లను ఆమె కలుస్తుంది. రోజా పలకరిస్తుంది. ఫలానా నటుడిని కలవాలనో, ఫలానా పని చేయాలనో ఆశపడేవారిని.. ఊరడించి ఆ కోరిక తీరుస్తుంది. అందుకు ఎంత ఖర్చయినా భరిస్తుంది"

నిజమే! ఇలాంటి సంస్థ ఒకటుందని ఇంతకుముందు పత్రికల్లో చదివాను. ఆమె ఆ సంస్థలో పనిచేస్తుందంటే నాకు ఆశ్చర్యం కలిగింది.

"మొన్నామధ్య విద్యుత్ షాక్ తగిలి..రెండు చేతులు..ఒక కాలు చచ్చుబడిపోయిన చిన్నారి..క్రికెట్ ఆడాలనుంది అని కోరితే... కృత్రిమ పరికరాలు అమర్చి.. ఆ ఆశ తీర్చిన ఆవిడ..నిజంగా ఎంత గొప్ప వ్యక్తి.."

కండక్టర్ ఆరాధనా పూర్వకంగా ఆమె గురించి చెబుతుంటే మాకు మాట రాలేదు.

"ఓ రోడ్డు ప్రమాదంలో భర్తను, పిల్లల్ని కోల్పోయి, ఒంటరితనంతో నలిగిపోతున్నది. ఆమె గురించి తేలిగ్గా మాట్లాడితే..."

మేమెంత తప్పు చేశామో అర్థం అయింది. మనుషుల బాహ్యప్రవర్తన చూసి అభిప్రాయం ఏర్పరచుకోవటం ఎంత పొరపాటో గ్రహించాము.

ముఖ్యంగా నేను సిగ్గుతో చితికిపోయాను. కండక్టరు చెబుతూనే ఉన్నాడు. అవేమీ నా చెవిన పడలేదు.

"మళ్లీ ఆమె నా కంట ఎప్పుడు పడుతుందో..క్షమించమని వేడుకోవాలి.." దృఢంగా అనుకున్నాను.

ఆమె గురించి ఆలోచిస్తూండిపోయాను.

**-శ్రీసాయివల్లవి** (సికిందరాబాద్)

★★★

# పరీక్ష

ఎమ్.సి.ఏ పూర్తిచేసిన వెంటనే నెలకి ఇరవై వేల జీతంతో సొంత ఊర్లోనే మా అబ్బాయికి ఉద్యోగం రావడం చాలా అదృష్టంగా అందరూ కొనియాడారు. అలాంటిది, మరో మూడు నెలల్లో ఒక పెద్ద అమెరికన్ కంపెనీ నుండి ఉద్యోగానికి కాల్ లెటర్ రావడంతో మమ్మల్ని తెలిసిన వాళ్ళందరూ పొగడ్తల్తో ముంచెత్తారు.

మేం కూడా అబ్బాయి భవిష్యత్తు ఇంత ఉజ్వలంగా ఉంటుందని ఊహించలేదు. దిగువ మధ్య తరగతి కుటుంబంలో పుట్టినా, చదువులో ప్రతిభ కనబరుస్తూ, టెన్తు హయ్యర్ ఫస్ట్ క్లాసులో పాస్ కావడంతే, కాలేజీలో స్కాలర్‌షిప్ లభించింది. ఎమ్.సి.ఏ. పాసుకావడం, వెనువెంటనే ఇక్కడే మంచి కంపెనీలో ఉద్యోగం లభించడం అంతా వెనువెంటనే జరిగిపోయాయి. కలిగినంతలో అల్లారుముద్దుగా పెంచిన మాకు, కొడుకు అభివృద్ధి



ఆనందదాయకమే అయింది.

అమెరికన్ కంపెనీ రిటెన్ టెస్టుని, ఇంటర్వ్యూని హైదరాబాద్‌లోని ఒక పేరుమోసిన ఫైవ్‌స్టార్ హోటల్లో అరేంజ్ చేసారు. అబ్బాయితోపాటు నేనూ, హైదరాబాద్ వెళ్దామని బయలుదేరాను. త్వరలోనే అమెరికా వెళ్ళిపోతున్న కొడుకుని విడిచి రెండురోజులు కూడా ఉండలేనని మా ఆవిడ కూడా బయలుదేరింది. పరీక్షలో పాసవుతాడా లేదా అన్న టెన్షన్ మాకు లేదు.

మా అబ్బాయి ప్రతిభపై మాకు పూర్తి నమ్మకం ఉంది. అయినా, అబ్బాయి ఏదైనా టెన్షన్‌కి గురవుతున్నాడేమోనని చూశా. నిశ్చింతగా బస్సు కిటికీలోంచి బైటకు చూస్తూ కూర్చున్న అబ్బాయిని మాట్లాడి డిస్టర్బ్ చేయాలనిపించలేదు.

హైదరాబాద్‌లో బస్సు దిగి, రాత్రి హోటల్లో రెస్టు తీసుకొని, మర్నాడు ఉదయాన్నే రిటెన్ టెస్టు సెంటర్‌కు చేరుకున్నాం. చాలామంది అభ్యర్థులు అప్పటికే చేరుకొని ఉన్నారు.

మా అబ్బాయి రిటెన్ టెస్టు రాస్తున్నంత సేపూ, బైట హాల్లోని సోఫాలో మేం వెయిట్ చేసాం. గంటన్నరలో రిటెన్ టెస్టు ముగించుకొని, మా అబ్బాయి మా వద్దకు చేరాడు. రిటెన్ టెస్టు రిజల్టు ప్రకటించడానికి ఇంకా రెండు గంటలు పడుతుంది. ఇందులో పాస్ అయిన వాళ్ళని వెనువెంటనే ఇంటర్వ్యూ చేసి, కంపెనీలో ఉద్యోగానికి సెలక్ట్ చేస్తారు.

మిగిలిన అభ్యర్థులంతా ఒకచోట గుమిగూడి, సమాధానాలు సరిగా రాసారో లేదో చూసుకుంటుండడం చూసి, మా అబ్బాయిని కూడా వాళ్ళ దగ్గరకు పంపించాను. వెళ్ళినవాడు అందరి సమాధానాలను చూస్తూ, వాళ్ళకి తెలియని ప్రశ్నలకు సమాధానాలు చెప్తూ, అందర్లో కలిసిపోయాడు. అందరూ తెలియక వదిలేసిన ప్రశ్నలకు కూడా సమాధానాలు చెబుతున్న వాడి తెలివితేటలకు మురిసిపోతూ చూస్తూండిపోయాం.

ముందుగా ప్రకటించినట్లే, రెండు గంటల్లో ఆన్సర్ షీట్లు వెరిఫై చేసి, రిజల్ట్స్ ప్రకటించారు. అయితే, మేమూహించని విధంగా మావాడు పరీక్షలో ఫైయిలై పోయాడు. నమ్మశక్యం కాక, రిజల్ట్ ఛార్ట్ పదే పదే చూశాను. ఈ పరిణామం ఊహించనిదేమో, నేను నిజంగానే షాక్ అయ్యాను.

మా అబ్బాయిని ఓదారుద్దామని వెంటనే బయటకు వచ్చాను. కానీ వాడు మామూలుగానే ఉండడంతో, తేలిగ్గా నిట్టూరుస్తూ, మా ఊరికి బయలుదేరదీశాను.

తిరుగుప్రయాణంలో, బస్సులో, కిటికీ అద్దం లోంచి బయటకు చూస్తూ ఉండిపోయిన అబ్బాయిని దగ్గరకు తీసుకొని ఓదారుస్తూ "నిరాశ చెందనవసరం లేదు నాన్నా, మరో కంపెనీలో ట్రై చేద్దాంలే" అన్నాను.

వాడు తలెత్తి నా వైపు చూస్తూ, "నేను తెలిసిన ప్రశ్నలకు కూడా జవాబులు తప్పులు రాసి ఫైలయ్యాను డాడీ. నిన్న రాత్రంతా ఆలోచించిన తరువాత మీరు నన్నెంతగా ప్రేమిస్తున్నారో అర్థం చేసుకున్నాను. చివరికాలంలో ఆసరాగా ఉంటాడనే ఆశతో, అల్లారుముద్దుగా పెంచిన ఒక్కగానొక్క కొడుకూ, అమెరికా వెళ్ళిపోయి, శాశ్వతంగా దూరమైపోతాడని తెలిసినా, ఆ బాధనంతా దిగమింగి, నా భవిష్యత్తు కోసమే తాపత్రయం పడుతున్న మీలాంటి ప్రేమమూర్తుల్ని వదలి, డబ్బు కోసం అక్కడికి వెళ్ళకూడదని నిర్ణయం తీసుకున్నా.

ఇప్పుడు నాకొస్తున్న ఇరవై వేలలో పదివేలకు పైగానే మిగులుతోంది. నా భవిష్యత్తుకోసం, ఆ సేవింగ్స్ చాలు. జీవితం కోసం సంపాదన గానీ, సంపాదన కోసం జీవితం కాకూడదు డాడీ. 'మనందరి ఆనందకరమైన జీవితం' అనే పరీక్షలో పాసవడం కోసం ఈ పరీక్షలో కావాలనే ఫైయిలయ్యాను" అన్నాడు.

మా మనసుల లోపలి పొరల్లోకి తొంగిచూస్తూ, మా ఆవేదనని అర్థం చేసుకొని, చిన్న వయస్సులోనే వాడు తీసుకున్న మంచి నిర్ణయానికి , ఆనందంతో చూస్తుండిపోయాను.

**-బిహెచ్.వి.నాగేశ్వరరావు** (రాయగడ)